సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 15 । జూన్ । 2023



స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

స్వయం ఉపాధితో గిరిజనులు ఆర్థికావృద్ధి సాధించవచ్చని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సూచించారు.

4లో



ఐటీడీఏ పీవో ఆకస్మిక తనిఖీ

జి.మాడుగుల మండలంలోని సుబ్బలు అంగన్‌వాడీ కేంద్రంలో ఐటీడీఏ పీవో అభిషేక్ తనిఖీలు నిర్వహించారు.

4లో



ఆకులో ఆకునై..

అనంతగిరి: మండల కేంద్రంలో మందార చెట్టుపై ఆకుపచ్చని రంగులోని ఓ మిడత ఆకులో ఆకునై అన్నట్టుగా కలిసిపోయింది.

న్యూస్‌రీల్

ట్రైబల్ వెల్ఫేర్ డీడీ సల్దిగెడ్డ సందర్శన



గిరిజనులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు

సాక్షి, పాడేరు: మినుములూరు పంచాయతీ సల్దిగెడ్డ గ్రామాన్ని గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు బుధవారం సందర్శించారు. ఈ గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు డీడీ కొండలరావు ఈ గ్రామాన్ని సందర్శించి గిరిజనులతో మాట్లాడారు. బడిఈడు చిన్నారులు తొమ్మిది మందిని మలకపాలెం ఆశ్రమ పాఠశాలలో చేర్పిస్తామని తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు సంబంధించి మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసేలా అధికారులకు నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటామని గిరిజనులకు డీడీ హామీ ఇచ్చారు.

కూలిన విద్యుత్ స్తంభాలు



రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

మారేడుమిల్లి : మండలంలోని కూడూరు గ్రామం వద్ద రహదారికి అడ్డంగా బుధవారం సాయంత్రం భారీ వృక్షం కూలింది. విద్యుత్‌లైన్‌పై పడటంతో మూడు స్తంభాలు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీంతో ఇరువైపులా వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



కూలిన విద్యుత్ స్తంభం

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలకు నేడు, రేపు కౌన్సెలింగ్

మారేడుమిల్లి: ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆరోవ తరగతిలో ప్రవేశాలకు గురు, శుక్ర వారాల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఏకలవ్య పాఠశాలల కన్వీనర్ టి.అరుణ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని మారేడుమిల్లి, రంపచోడవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి, చింతూరులోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆరోవ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని, అర్హత పొందిన విద్యార్థులకు ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9441119018, 8639193592 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చింతపల్లి: మండలంలో వాముగడ్డకు చెందిన వంతల గోవింద్ విద్యుదాఘాతానికి గురై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో లహరి సౌండ్ సిస్టమ్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న గోవింద్ ఈ నెల 8 వ తేదీన విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతనిని విశాఖ కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

భార్యపై హత్యాయత్నం

- గొడ్డలితో దాడి.. కేసు నమోదు

చింతపల్లి: మండలంలోని అంజలి గ్రామానికి చెందిన మూర్ల నారాయణరావు భార్య కొర్రా సింహాచలంపై గొడ్డలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్టు ఎస్‌ఐ అరుణ్‌కిరణ్ తెలిపారు. భార్యాభర్తల మధ్య కొద్దిరోజులుగా గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో భార్యపై నారాయణరావు మంగళవారం రాత్రి గొడ్డలితో మెడ, వీపుపై నరికాడు. ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిన ఆమె స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. అనుమానంతోనే భార్యపై దాడికి పాల్పడినట్టు ఆయన వివరించారు.

సర్కారు వైద్యం భేష్



రంపచోడవరం ఏరియా ఆస్పత్రి



ఏజెన్సీలో 11 మండలాలకు పెద్ద దిక్కయిన రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఆధునిక వైద్యసేవలు అందుబాటులో వచ్చాయి. ఒకప్పుడు రిఫరల్ కేసులు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు మెరుగైన వైద్యసేవలతోపాటు సర్జరీలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం వైద్యులు, సిబ్బందితోపాటు పూర్తిస్థాయిలో సేవలు అందేలా చర్యలు చేపట్టడంతో గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు
- ఆధునిక వసతులు సమకూర్చిన ప్రభుత్వం
- 11 మండలాలకు పెద్దదిక్కుగా గుర్తింపు

రంపచోడవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏజెన్సీలో వైద్య సేవలు బలోపేతం చేయడంలో ఎక్కడ రాజీ పడలేదు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిపై ఏజెన్సీలో 11 మండలాల ప్రజలు ఆధారపడ్డారు. గతంలో పూర్తిస్థాయిలో ప్రత్యేక వైద్యులు, వైద్య వసతులు లేకపోవడం వల్ల రిఫరల్ కేసులో ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. సర్జరీలు అందుబాటులోకి వచ్చాయి. రోజుకు 300 మందికి ఓపీలో సేవలందిస్తున్నారు.

ఆరు నెలల్లో వంద సర్జరీలు

రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఆరు నెలల క్రితం ఆర్థోపెడిక్ సర్జన్ సుధాకర్‌ను ప్రభుత్వం నియమించింది. అప్పటివరకు ఇక్కడి ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు అందుబాటులో లేవు. ఆయన బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి ఇప్పటివరకు ఆరునెలల వ్యవధిలో వంద వరకు సర్జరీలు చేశారు.

వైద్యం పొందేందుకు ఆసక్తి

అందుబాటులోకి వచ్చిన ఉన్నత వైద్య సేవలను గిరిజనులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

రిఫర్ చేయకూడదన్నదే లక్ష్యం



ఆర్థోపెడిక్‌కు సంబంధించి క్రిటికల్ కేసులకు సైతం ఇక్కడ సర్జరీలు చేస్తున్నాం. ఏ ఒక్క కేసు రిఫర్ చేయకూడదన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. రోజుకు సుమారు 20 వరకు ఎముకలకు సంబంధించి వైద్యసేవలు పొందుతున్నారు. వైద్య నిపుణులు ముగ్గురు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు వైద్యసేవలు అందిస్తున్నారు.

– డాక్టర్ కె సుధాకర్, ఆర్థోపెడిక్ సర్జన్, ఏరియా ఆస్పత్రి

అవగాహన అవసరం



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చర్మ వ్యాధులకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. దీనిపై గిరిజనులు అవగాహన పొంది సేవలను సద్వినియోగం చేసుకోవాలి. రోజుకు పది కేసుల వరకు వస్తున్నాయి. చర్మ వ్యాధులకు సంబంధించి అవసరమైన మందులను ఏర్పాటుకు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సహకారంతో చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్.పసులేటి ప్రవీణ, చర్మవ్యాధి నిపుణులు, ఏరియా ఆస్పత్రి, రంపచోడవరం

పిల్లల్లో రక్తహీనత ఎక్కువ



ప్రతి రోజు ఓపీకి వచ్చిను సుమారు 30 మంది వరకు పిల్లలను పరీక్షిస్తున్నాం. వీరిలో చాలామందిలో రక్తహీనత కనిపిస్తోంది. కొన్ని రకాల పరీక్షలు అందుబాటులోకి వస్తే ఇక్కడే పిల్లలకు వైద్య సేవలు అందించవచ్చు. అధికారులు దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. పిల్లలు వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు గిరిజనులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ ఎం, ఆదిలక్ష్మి, పిల్లల వైద్య నిపుణులు, ఏరియా ఆస్పత్రి

క్షయ రోగులకు సేవలు



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో బాధ్యతలు చేపట్టి ఆరు నెలలు అవుతోంది. ఓపీలో రోజుకు 50 మంది వరకు రోగులకు సేవలందిస్తున్నాం. ఇటీవల మలేరియా, టీబీ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొంత మంది కీళ్లవాతంతో వస్తున్నారు. ప్రతి రోజు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం.

– డాక్టర్, కిరణ్, జనరల్ ఫిజీషియన్, ఏరియా ఆస్పత్రి

200 కంటి శస్త్ర చికిత్సలు



ఏరియా ఆస్పత్రిలో ఆరు నెలల వ్యవధిలో 200 మంది కంటి రోగులకు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నాం. కంటిపై భాగంలో కొవ్వుపొర తొలగింపు, కేటరాక్స్ శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నాం. కంటికి సంబంధించి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఎవరు బయట ప్రాంతానికి వెళ్లనవసరం లేదు. సద్వినియోగం చేసుకోవాలి.

– డా. కల్పన, కంటి వైద్య నిపుణులు, ఏరియా ఆస్పత్రి

అందుబాటులో దంత వైద్యం



రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో నాలుగేళ్లుగా కాంట్రాక్ట్ వైద్యుడుగా దంత వైద్య సేవలు అందిస్తున్నా. రోజుకు 15 మంది వరకు దంత సమస్యలతో ఆస్పత్రికి వస్తున్నారు. ఇక్కడే మెరుగైన వైద్యం అందించేందుకు సౌకర్యాలు ఉన్నాయి. రోగులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్. మధు, డెంటిస్టు, ఏరియా ఆస్పత్రి

నెలకు 80 వరకు ప్రసవాలు



ఏరియా ఆస్పత్రిలో నెలకు 80 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య బాగా పెరుగుతోంది. హైరిస్క్ కేసులకు ఇక్కడే వైద్య సేవలు అందిస్తున్నాం. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి వచ్చిన కేసులకు ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రసవాల కేసులను రిఫర్ చేయకుండా ఇక్కడే సేవలు అందిస్తున్నాం.

– కె. లక్ష్మి, గైనికాలజిస్ట్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి

సెల్ టవర్ల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి

- నేడు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- గిరిజనులతో వీడియో సమావేశంలో మాట్లాడనున్న ముఖ్యమంత్రి
- కలెక్టర్ సుమిత్‌కుమార్



భీమవరంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్రంలో ఎస్పీ తుహిన్ సిన్హా

హుకుంపేట: జిల్లాలో నిర్మాణాలు పూర్తయిన 88 సెల్ టవర్లను గురువారం వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని భీమవరం పంచాయతీ కేంద్రంలో ఆయన పర్యటించారు. సీఎం ప్రారంభించనున్నట సెల్ టవర్‌ను పరిశీలించారు. ప్రారంభమ ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెల్ టవర్ వల్ల కలిగే ప్రయోజనాలను సీఎం గిరిజనుల నుంచి వీడియో సమావేశం ద్వారా తెలుసుకుంటారన్నారు. ఇందుకు సిద్ధం కావాలని ఆయన గ్రామ గిరిజనులకు సూచించారు. ఎస్పీ తుహిన్ సిన్హా, ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రారంభ ఏర్పాట్లు పరిశీలన

జి.మాడుగుల: మండలంలో కిల్లంకోట పంచాయతీ సుబ్బులు గ్రామంలో సెల్ టవర్ ప్రారంభ ఏర్పాట్లను గురువారం పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ పర్యవేక్షించారు. జిల్లాలో 100 జియో సెల్ టవర్ల నిర్మాణం చేపట్టగా 88 పూర్తయ్యాయి. వీటిని శుక్రవారం వర్చువల్ విధానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో సుబ్బులు గ్రామంలో ఏర్పాట్లను పీవో పరిశీలించారు. ఎంపీడీవో చంద్రశేఖరరావు, తహసీల్దార్ అప్పలస్వామి పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

నీట్‌లో గిరి బాలుర సత్తా



తల్లిదండ్రులతో ఇస్సాకు(420 మార్కులు)

మధురవాడ: నీట్ ఫలితాల్లో మారికవలసలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. సంస్థ నుంచి 28 మంది పరీక్షలకు హాజరు కాగా 15 మంది అర్హత సాధించడం విశేషం. ఇందులో కె.ఇస్సాకు 420 మార్కులు సాధించి ఆలిండియా ఎస్టీ కేటగిరీలో 3,073వ ర్యాంకు సాధించాడు. గురుకులాల్లో రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలిచాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం ఈదుల బయలు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ సత్తిబాబు, మహేశ్వరిల కుమారుడు ఇస్సాకు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించే అవకాశాన్ని సొంతం చేసుకున్నాడు.

- చింతపల్లి మండలం పాత కిన్నెర్ల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు పి.బంగార్రాజు, నీలమ్మల కుమారుడు మత్యరాజు 319 మార్కులు సాధించి ఆలిండియా స్థాయి ఎస్టీ కేటగిరీలో 10,731వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. ఇతనికి ప్రభుత్వ కళాశాలలో బీడీఎస్ సీటు దక్కే అవకాశాలు ఉన్నాయి.
- హుకుంపేట మండలం ఈదుల గరువు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ లక్ష్మి కుమారుడు గోపాలరావు 283 మార్కులతో ఆలిండియా స్థాయిలో ఎస్టీ కేటగిరీలో 14,651వ ర్యాంకు సాధించాడు. ఇతను కూడా ప్రభుత్వ కళాశాలలో బీడీఎస్‌లో సీటు పొందే అవకాశాలు ఉన్నాయని ప్రిన్సిపాల్ శివప్రసాద్ చెప్పారు. ఆ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ విద్యార్థులను అభినందించారు.

చింతపల్లి: మండలంలో చౌడుపల్లి పంచాయతీ ఈదులబయలుకు చెందిన కొర్ర ఇస్సాకు 3648 ర్యాంక్ సాధించాడు. చింతపల్లి ఏపీఆర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. మంచి ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉందని అతను తెలిపాడు.



మత్యరాజు (319 మార్కులు)



గోపాలరావు (283 మార్కులు)

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ



రంపచోడవరంలో రక్తదానం చేస్తున్న ఏఎస్పీ జగదీష్ అదహళ్లి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- పాడేరులో రక్తదాన శిబిరం నిర్వహణ

సాక్షి,పాడేరు: అన్నివర్గాల ప్రజలు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ, జాతీయ సేవా పథకం, రక్తదాన చైతన్య సేవాకర్త కొమ్మోజు గణేష్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సీఆర్‌పీఎఫ్ జవాన్లతో పాటు పలువురు యువకులు, విద్యార్థులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు సుమారు 22 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వీరిని కలెక్టర్ సుమిత్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతంగా ఉన్న యువకులు ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. జిల్లాలో వైద్య ఆరోగ్య కార్యక్రమాలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు.సీఆర్‌పీఎఫ్ జవాన్ల రక్తదాన సేవలు అభినందనీయమన్నారు.విద్యార్థులు చదువుతో పాటు సామాజిక కార్యక్రమాలను అలవర్చుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, జిల్లా ఆస్పత్రి వైద్యాధికారి రూపకళ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి, బ్లడ్‌బ్యాంకు ఇన్‌చార్జి రాజు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు లోహితాష్, జయలక్ష్మి, సుర్యారావు, సుబ్రహ్మణ్యం, సంజీవ్, గౌరీశంకర్, సత్యనారాయణ, మణికుమారి, కె.ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రంపచోడవరం : ప్రతిఒక్కరూ రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలు కాపాడిన వారు అవుతారని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అదహళ్లి అన్నారు. ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ రకదానం చేసేందుకు ముందుకు వచ్చిన యువతను అభినందించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఏఎస్పీతో పాటు స్థానిక సీఐ, ఎస్‌ఐ, పలువురు కానిస్టేబుళ్లు రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మి, కౌన్సిలర్ వాసు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి.. ఉత్తమ ర్యాంక్‌లు సాధించి..



లాస్య సాహితి



శ్యామల జాహ్నవి



మద్దిరాల అజిత్ కుమార్



కొండపాటి సత్య కౌశిక్



కరి ఆశ్రిత



కాంతారు అనూప్‌కుమార్



వందన



చెండా జాహ్నవి



సుర్ర లోకచందులాల్



సాయి సంపత్



గురు సాయి సురేష్



శైలజ

ఏపీ ఈఏపీసెట్‌లో మెరిసిన గిరి విద్యార్థులు

కూనవరం: జిల్లాలో విలీన ప్రాంతాలైన కూనవరం, ఎటపాక మండలాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఏపీఈఏపీ సెట్‌లో ప్రతిభ కనబరిచారు. కూనవరంలో మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఉప్పలపాటి లాస్యసాహితి 7,023 ర్యాంకు సాధించింది. ఈమె ఇటీవల నిర్వహించిన నీట్‌లో కూడా అత్యంత ప్రతిభ కనబరిచింది. మండల పరిధిలోని టేకులబోరు గ్రామానికి చెందిన శ్యామల జాహ్నవి 8,109 ర్యాంకు, మద్దిరాల అజిత్ కుమార్ 10,137 ర్యాంకు సాధించాడు. ఎటపాక గ్రామానికి చెందిన కొండపాటి సత్యకౌశిక్ 6,468 ర్యాంకు, నెల్లికకు చెందిన కరి ఆశ్రిత 1,299 ర్యాంకు సాధించారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టుకు చెందిన వస్త్ర వ్యాపారి కాంతారు మోహన్ కుమారుడు కాంతారు అనూప్‌కుమార్ ఏపీ ఈఏపీసెట్‌లో 2,818 ర్యాంక్ సాధించాడు. అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసి వ్యవసాయశాస్త్రవేత్త స్థాయికి ఎదగాలన్నది తన లక్ష్యమని తెలిపారు. మండలంలోని కిలగాడ గ్రామానికి చెందిన చెండా కేశవరావు కుమార్తె చెండా జాహ్నవి 7,999 ర్యాంక్ సాధించింది. జోలాపుట్టుకు చెందిన కాంతారావు కుమార్తె వందన కూడా 11,905 ర్యాంక్ సాధించింది. ఏపీఈఏసెట్‌లో తమ పిల్లలు మంచి ర్యాంకులు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేశారు.

హుకుంపేట: మండలంలోని మట్టుజోరు గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి సుర్ర చందులాల్ దొర ఏపీ ఈఏపీసెట్‌లో 1715 ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే మంచి ర్యాంకు సాధించగలిగానని, వారికి రుణపడి ఉంటానని అతను తెలిపాడు. తమ కుమారుడు మంచి ర్యాంక్ సాధించడం ఎంతో గర్వంగా ఉందని తల్లిదండ్రులు చిన్నారావు, సత్యవతి తెలిపారు.

అరకు రూరల్: మండలంలోని పెదలబుడు పంచాయతీ పానిరంగిని గ్రామానికి చెందిన కిల్లో సాయి సంపత్ 3,356 ర్యాంక్, మాడగడ పంచాయతీ పక్కనగూడకు చెందిన పడల శైలజ 1512 ర్యాంక్ సాధించారు. మండల కేంద్రం డుంబ్రిగుడకు చెందిన మండేగురు సాయి సురేష్ 9332 ర్యాంక్ సాధించాడు. ఏపీఈఏసెట్‌లో తమ పిల్లలు మంచి ర్యాంకులు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేశారు.

సివిల్ ఇంజనీరింగ్ చదువుతా



సివిల్ ఇంజనీరింగ్ చదివి, తరువాత సివిల్స్ సత్తా చాటాలనే ఆశయంతో ఉన్నా. తల్లిదండ్రులు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు. వారు ఉన్నత చదువులకు ప్రోత్సహిస్తున్నారు. ఏపీ ఈఏపీ సెట్‌లో 8089 ర్యాంక్ సాధించా.

– మోద సౌమ్యవాహిని, చాకలిపేట, పాడేరు

సాక్షి, పాడేరు: ఏపీ ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులు తమ ఆనందాన్ని, ఆశయాలను తెలియజేశారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

కంప్యూటర్ సైన్స్ చదువుతా



ఏపీ ఈఏపీసెట్‌లో 1322 ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉంది. జిల్లాకు సంబంధించి టాప్ టెన్‌లో స్థానం పొందా. తన ఉన్నత విద్యకోసం తల్లిదండ్రులు ఎంతో శ్రమిస్తున్నారు.ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ చదువు పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతా.

– వనపరి దినేష్‌రాజు, గుడివాడ వీధి, పాడేరు

టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది



ఏపీ ఈఏపీసెట్‌లో 395 ర్యాంక్ సాధించడంతో పాటు, జిల్లాలో టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. ఇంజినీరింగ్ ఫార్మసీ పూర్తి చేసి, సివిల్స్‌కు ప్రిపేర్ అవుతా. తల్లిదండ్రులు వ్యాపారం చేసి ఉన్నత చదువులకు ప్రోత్సహిస్తున్నారు.

– గొల్ల మహతి, ఇందుకూరుపేట, దేవీపట్నం మండలం

తపాలా సేవలపై ఇంటింటా ప్రచారం

అరకులోయ రూరల్: తపాలా శాఖ సేవలపై గ్రామాల్లో ఇంటింటా విస్తృత ప్రచారం చేయాలని అనకాపల్లి పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ జనపాల ప్రసాద్‌బాబు చెప్పారు. మండల కేంద్రంలో ఆయన బుధవారం పర్యటించారు. స్థానిక తపాలాశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ అభినవ్ వాలియా ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన మహిళ సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 20న ఈ మేరకు స్పెషల్ డ్రైవ్ చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 65000 ఖాతాలు తెరిచే లక్ష్యాన్ని ఉన్నతాధికారులు సూచించారన్నారు. అనంతరం వన్.జన్‌ధన్ కార్యక్రమంలో భాగంగా అరకులోయ సబ్ తపాలా శాఖ కార్యాలయం పరిధిలో ఉన్న 76 పోస్టాఫీసుల పనితీరుని పరిశీలించి సమీక్షించారు. అరకు సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, సబ్ పోస్ట్ మాస్టర్ సాయిదిలీప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

వీఆర్‌పురం: మండలంలోని శ్రీరామగిరి క్రాస్‌రోడ్ వద్ద బుధవారం బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీ కొట్టిన ఘటనలో సీతంపేటకు చెందిన కోట్ల వరదరాజు(33) అనే వ్యక్తి మృతి చెందాడు. వరదరాజు రాజుపేటలోని బంధువుల ఇంటికి శుభకార్యం నిమిత్తం వెళ్లి అక్కడి నుంచి జీడిగుప్ప వెళుతుండగా శ్రీరామగిరి క్రాస్‌రోడ్ వద్ద బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టాడు. అటుగా వెళ్లే వాహనదారులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అతనిని తొలుత రేఖపల్లి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స నిర్వహించి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కూనవరం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వరదరాజు మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: స్వయం ఉపాధితో గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గన్నేరుపుట్టు పంచాయతీ డొంకినివలస, సూకురు పంచాయతీ చట్రాయిపుట్టు గ్రామాల్లో ఆయన స్థానిక నాయకులతో కలిసి బుధవారం పర్యటించారు. ఇందులో భాగంగా డొంకినివలస గ్రామంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేశవాళీ కోళ్ల పెంపకానికి రూ.50వేల వ్యయంతో ఏర్పాటు చేసిన కోళ్ల ఫారమ్‌ను ఆయన ప్రారంభించారు. గిరిజన రైతులకు కోళ్ల పెంపకానికి సంబంధించి దాణా, ఇతరత్రా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధి చెందేందుకు ప్రభుత్వ శాఖలతో పాటు రోటరీ క్లబ్ (వైజాగ్) పలు కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. ఇందులో భాగంగా కోళ్ల ఫారమ్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. గిరిజన రైతులకు ఉచితంగా అందిస్తున్న దేశవాళీ కోళ్లను అందిస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోళ్ల పెంపకం ద్వారా గిరిజనులు మంచి ఆర్థికాభివృద్ధి చెందవచ్చన్నారు. రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

అనంతరం సూకురు పంచాయతీ చట్రాయిపుట్టు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో సర్పంచ్ దనసాని సత్యవతి సొంత నిధులతో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను ఆయన ప్రారంభించారు. తాగునీటి కోసం గిరిజనులు పడుతున్న సమస్యను గుర్తించి అత్యవసరంగా కుళాయిలు ఏర్పాటు చేయడంపై సర్పంచ్‌ను అభినందించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, పశు సంవర్ధక శాఖ ఏడీ రాజ రవికుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సునిత లావణ్య, వైస్ ఎంపీపీ ఎస్.కొండలరావు, మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, వెటర్నరీ డాక్టర్లు చరణ్, వరప్రసాద్, సతీష్, భాస్కర్, సర్పంచ్‌లు లక్ష్మయ్య, నైని సన్నిబాబు, పాటి చిన్నయ్య, బొంజన్నదొర, ఎంపీటీసీ సభ్యుడు భీమలింగేశ్వరరావు, నాయకులు మురళి, చిన్నేశ్వరరావు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



కోళ్ల పెంపకానికి అవసరమైన సామగ్రిని గిరిజన రైతులకు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం తదితరులు

ఐటీడీఏ పీవో ఆకస్మిక తనిఖీ

- అంగవాడీ కేంద్రంలో రికార్డులు, సరకుల పరిశీలన
- చిన్నసైజు గుడ్ల సరఫరాపై ఆరా
- ఐసీడీఎస్ పీడీ, సీడీపీవో, సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీసులు

జి.మాడుగుల: మండలంలో కిల్లంకోట పంచాయతీ సుబ్బులు గ్రామంలో పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ పర్యటించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రంలో ఎనిమిది మంది పిల్లలకు గాను ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. పిల్లల ఎత్తు, బరవులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం ద్వారా అందించే గుడ్లు చిన్న సైజులో ఉండడం, బరువు 25 గ్రాములు మాత్రమే ఉండడాన్ని గుర్తించారు. దీనిపై సంబంధిత ఐసీడీఎస్ పీడీ, సీడీపీవో, కిల్లంకోట సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్‌కు షోకాజ్ నోటీసులను ఆయన జారీ చేశారు. చిన్నసైజు గుడ్లు సరఫరా చేసిన డీలర్‌పై చర్యలు చేపట్టాలని ఐసీడీఎస్ పీడీని ఆయన ఆదేశించారు. సీడీపీవో సువర్ణమ్మ, తహసీల్దార్ అప్పలస్వామి తదితరులున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

నిండు గర్భిణి ఆత్మహత్య

నక్కపల్లి : మండలంలో వెదుళ్లపాలెం గ్రామానికి చెందిన గర్భిణి కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన ఓరుగంటి శ్రావణి (21)కి పెనుగొల్లుకు చెందిన శివతో మూడు మాసాల క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం ఈమె రెండు నెలల గర్భిణి. ఈమె తరచూ కడుపు నొప్పితో బాధపడుతోందని, కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం రాత్రి కడుపునొప్పి తీవ్రంగా రావడంతో తన గదిలోకి వెళ్లి చీరతో ఉరేసుకుందన్నారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆమెను కిందికి దించి ఆస్పత్రికి తరలించేలోపే మరణించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుమార్తె కడుపునొప్పి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని, ఆమె తల్లి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శిరీష తెలిపారు.



శావణి (ఫైల్)

విద్యుదాఘాతంతో నాలుగు పశువుల మృతి

రాజవొమ్మంగి : మండలంలోని జమ్మిచావడి గ్రామ సమీపాన కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి ఎల్లెం సత్తిబాబుకు చెందిన రెండు దుక్కిటెద్దు, కొంగర బాబ్జీదొరకు చెందిన రెండు పాడి గేదెలు అక్కడికక్కడే మరణించాయి. సుమారు రూ.1.9 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. వ్యవసాయ పనుల కాలంలో ఇలా జరగడంతో నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. పశు వైద్యాధికారి తరుణ్ మరణించిన పశువులకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం చేశారు. కాగా మంగళవారం రాత్రి సంభవించిన ఈదురు గాలులకు విద్యుత్ లైన్స్‌పై చెట్టు పడిపోవడంతో తీగలు తెగి పడ్డాయని ఏపీఈపీడీసీఎల్ ఏఏఈ సురేష్‌కుమార్ తెలిపారు. కిందికి వేలాడుతున్న వైర్లు పశువుల కాళ్లకు చుట్టుకోవడంతో పశువులు మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు.



విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందిన పశువులు

ఆర్‌అండ్‌బీ ఎస్ఈగా కాంతిమతి

సాక్షి, విశాఖపట్నం: రోడ్లు భవనాల శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్(ఎస్ఈ)గా కె.కాంతిమతి నియమితులయ్యారు. ఆమె శ్రీకాకుళం ఎస్ఈగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఉమ్మడి విశాఖ జిల్లాకు ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న జాన్ సుధాకర్ శ్రీకాకుళం బదిలీ అయ్యారు. జాన్ సుధాకర్ విధుల నుంచి రిలీవ్ అవ్వడంతో ఆ స్థానంలో కాంతిమతి తాజాగా బాధ్యతలు చేపట్టారు.

పూర్తిస్థాయిలో విద్యార్థుల హాజరు

- ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశం
- ఉపాధ్యాయులతో సమీక్ష

చింతూరు: పాఠశాలలకు విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే ఆదేశించారు. పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో తన పరిధిలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ప్రారంభం రోజున పాఠశాలలకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారు..ఇంకా ఎంతమంది రావాల్సి ఉంది.. జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ తదితర వివరాలను పాఠశాలల వారీగా ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పాఠశాలలో నమోదైన విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు అందించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులంతా తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకుని అందుకు అనుగుణంగా బోధించాలని, జీసీసీ నుంచి సరకులు తీసుకునే సమయంలో వాటి నాణ్యత పరిశీలించాలని సూచించారు. కోడిగుడ్లు 50 గ్రాముల బరువు వుండేలా చూసుకోవాలని ఆయన ఆదేశించారు. పాఠశాలలు, వసతిగృహాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పీవో ఆదేశించారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనుల పురోగతి, వసతిగృహాల్లోని సరకుల స్టాక్ వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీలో గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి పర్యటించే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏపీవో కంచర్ల సుజాత, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, బాలరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పెదబయలు: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సీఆర్‌పీఎఫ్ పోలీసులు యోగాపై గిరిజనులకు అవగాహన కల్పించారు. యోగా డేను పురస్కరించుకొని మండలంలోని పెదబయలు మండలం

సీతగుంట పంచాయతీ ముసిడిపుట్టు గ్రామంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు యోగాసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రతి రోజూ యోగా చేయడం దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తోందన్నారు. ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు.

ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు యోగా నేర్పించారు. చిన్నపిల్లలు ఇప్పటి నుంచే అలవర్చుకుంటే భవిష్యత్తులో మరింతా ఫలితం లభిస్తోందన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉన్నత విద్యపై దృష్టి సారించాలని, ప్రభుత్వం అందించే ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. యోగా నేర్పించడం ఎంతో బాగుందని గ్రామస్తులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామస్తులకు అల్పాహారం అందించారు. స్థానిక స్టేషన్ ఏఎస్ఐ చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కిమంకరి బొంజుబాబు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ముసిడిపుట్టు గ్రామస్తులకు యోగాసనాలు నేర్పిస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు



చుట్టుమెట్ట గ్రామంలో యోగా కార్యక్రమానికి వచ్చిన గిరిజనులు

యోగాతో మానసిక ప్రశాంతత

జి.మాడుగుల: మండలంలోని చుట్టుమెట్ట గ్రామంలో గిరిజనులకు సీఆర్‌పీఎఫ్ 198–బెటాలియన్ ఆధ్వర్యంలో యోగాసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిచంఆరు. రోజు యోగా చేయడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని సీఐ సత్యనారాయణ తెలిపారు. గిరిజనులు యోగాపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ఎస్ఐ శ్రీనివాస్, సర్పంచ్ కిముడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి బ్యాగులు వదిలి పరారీ



చింతూరు సెంటర్లో గంజాయి స్మగ్లర్లు వదిలేసిన బ్యాగులు

చింతూరు: పోలీసుల తనిఖీలు తప్పించుకునే ప్రయత్నంలో స్మగ్లర్లు గంజాయి బ్యాగులను వదిలి పరారైన సంఘటన బుధవారం చింతూరులో జరిగింది. స్థానిక పోలీసుస్టేషన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో బైక్‌పై అనుమానాస్పదంగా వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపే ప్రయత్నం చేశారు. దీంతో వారు బైక్‌ను ఆపకుండా వేగంగా వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని వెంబడించారు. ఈ క్రమంలో స్మగ్లర్లు చింతూరు సెంటర్లో బ్యాగులను విసిరేసి పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న బ్యాగులను సోదా చేయగా 20 కిలోల గంజాయి లభ్యమైందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

నాడు-నేడు పనులు వేగవంతం



సూచనలు ఇస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

పెదబయలు: మన బడి నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నిర్లక్ష్యం చేయడం తగదని అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఇక్కడ నాడు-నేడు పనుల జాప్యంపై పాఠశాల ప్రత్యేక అధికారిపై మండిపడ్డారు. పాఠశాల ఖాతాలో రూ.6 లక్షల నిధులు ఉన్నా పనులు ఎందుకు జాప్యం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు తరగతి గదులు నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలూర పాఠశాల-2లో పనులు వేగవంతం చేయాలన్నారు. పనులు జరిగిన వాటికి ఎప్పటికప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేయాలని, పెండింగ్ లేకుండా చూడాలని ఇంజినీర్లను ఆయన ఆదేశించారు. జిల్లాలో అన్ని పాఠశాలల్లో నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, వర్షాలు పడినా పనులు నిలిచిపోకుండా కాంట్రాక్టులు రా మేటీరియల్ అందుబాటులో ఉంచుకోవాలని, ముఖ్యంగా ఇసుక ఇబ్బందులు లేకుండా ముందుస్తుగా నిల్వ చేసుకోవాలని సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల హెచ్ఎంలు, ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యారులు పూర్తి స్థాయిలో పాఠశాలకు వచ్చేలా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, ప్రతీ విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్లు అందించాలని సూచించారు. ఎంపీడీవో పూర్ణయ్య, ఎంఈవో కె.సింహాచలం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మాణ పనులకు సహకారం

రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రాజవొమ్మంగి: మండలంలో మీదుగా జరుగుతున్న ఎన్‌హెచ్ 516 ఈ జాతీయ రహదారి నిర్మాణ పనులకు సహకరించాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ కోరారు. బుధవారం ఆయన జడ్డంగి, తంటికొండ సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయం, సూరంపాలెంలో నిర్వాసితులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. మార్కింగ్ ఇచ్చిన స్థలాలకు చెందిన డాక్యుమెంట్లను ఆయన పరిశీలించారు. భూ యజమానులతో మాట్లాడారు. ఒరిజినల్ డాక్యుమెంట్లు చూశారు. స్థలాలు, భూములు, ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వ లెక్కల ప్రకారం నష్టపరిహారాన్ని మరో 40 రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. హైవే నిర్మాణ పనులకు సంబంధించి భూములు, ఇళ్లను వెంటనే అప్పగించాలని ఆయన కోరారు. తహసీల్దార్ వైవీ సుబ్రమణ్యాచారి, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పవర్ టిల్లర్ల సద్వినియోగం

పీవీటీజీ రైతులకు 102 పంపిణీ

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ పరిధిలోని పీవీటీజీ రైతులంతా పవర్ టిల్లర్లను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ పిలుపునిచ్చారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద బుధవారం సీసీడీపీ నిధులు రూ.1,19,64,600 విలువైన 102 పవర్ టిల్లర్లను పీవీటీజీ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీటీజీ రైతులకు రూ.లక్ష రాయితీపై పవర్ టిల్లర్లను అందిస్తున్నామని చెప్పారు. రైతులు తమ వాటాగా రూ.17,300 సొమ్ము చెల్లించాలన్నారు. ఏజెన్సీలోని పెదబయలు మండలంలో 17 మంది, పాడేరు మండలంలో 45 మంది, అరకువ్యాలీలో 18 మంది, హుకుంపేటలో ఆరుగులు, అనంతగిరి మండలంలో 16 మంది పీవీటీజీ రైతులకు పంపిణీ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వీటిని కేవలం వ్యవసాయ పనులకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. పవర్ టిల్లర్లను ఇతరులకు విక్రయించకూడదని అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పవర్ టిల్లర్లతో రైతులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. రైతు భరోసా అందుతుందా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులందరికి ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు వచ్చాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి ఎస్. అశోక్, హెచ్‌వో అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు పవర్ టిల్లర్లను అందజేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, చిత్రంలో ఐటీడీఏ పీవో అభిషేక్

ఆటో బోల్తా.. బాలుడి మృతి

పలువురికి తీవ్ర గాయాలు

చింతపల్లి రూరల్: మండలంలోని ఎర్రబొమ్మల పంచాయతీ తెప్పలమామిడి సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం చేటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి చింతపల్లి ఎస్ఐ అరుణ్ కిరణ్ తెలిపిన వివరాలిలావున్నాయి. కొయ్యూరు మండలం గోకిరి గ్రామానికి చెందిన కొంతమంది కొయ్యలబందలో జరిగిన కార్యక్రమానికి ఆటోలో వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో శాతా విశాల్ అనే ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. ఆటోలో ఉన్న కుడుముల వెంకట లక్ష్మి, రాటా రాజుబాబు,కుడుముల పాపాయమ్మ, కుడుముల కుమారి, కసిపల్లి అనూష, కసిపల్లి నూకరత్నం తీవ్రంగా గాయపడ్డారు. వీరిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో కుడుముల కుమారి, కసిపల్లి అనూష, కసిపల్లి నూకరత్నంను మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించినట్టు పోలీసులు తెలి పారు. క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సేరస్వతి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అరుణ్‌కిరణ్ తెలిపారు.



బోల్తా పడిన ఆటో



బాలుడు శాతా విశాల్ మృతదేహం